క్లుప్తంగా

సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయం



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్‌: సత్య సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో సమాజ అభివృద్ధికి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల సత్య సాయి బాబా మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొని మాట్లాడారు. సమాజంలోని అట్టడుగు వర్గాల అభివృద్ధికి సత్యసాయి బాబా చేసిన సేవలు ప్రపంచవ్యాప్తంగా పేరు పొందాయని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, రామిరెడ్డి, గిరి, భక్తులు పాల్గొన్నారు.

రామచంద్రరావుకు ఘనస్వాగతం



రామచంద్రరావును సన్మానిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు గుమ్మడిదల మండల పార్టీ అధ్యక్షుడు ఐలయ్య ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. శుక్రవారం మెదక్ జిల్లా పర్యటనకు వెలుతున్న ఆయనకు టోల్ ప్లాజా వద్ద మహిళలు హారతులిచ్చి ఆహ్వానించారు. జిన్నారం, గుమ్మడిదల మండలాల నాయకులు భారీగా తరలివచ్చి సన్మానించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి, ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సామల అంజిరెడ్డి ఉన్నారు.

బయోకంట్రోల్ కిట్‌ల పంపిణీ



బయోకంట్రోల్ కిట్‌లను పంపిణీ చేస్తున్న అధికారులు

జహీరాబాద్ టౌన్‌: వ్యవసాయశాఖ సహకారంతో ఇక్రిశాట్ వారు మొగుడంపల్లి కంది రైతులకు బయోకంట్రోల్ ఏజెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాథాలజీ లీడర్ డాక్టర్ మమతా శర్మ మాట్లాడుతూ కంది పంటకు బయోకంట్రోల్ కిట్ వాడకం వల్ల రసాయన పురుగుమందుల వాడకం తగ్గుతుందన్నారు. పంట ఉత్పత్తి, నేల సంతానోత్పత్తి పెరుగుతుందన్నారు. పొడి భూములు సారవంతమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రమణ, డాక్టర్ జూబా జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో విలువైన ప్రభుత్వ భూములను అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారని వచ్చిన ఫిర్యాదులకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణ సమీపంలోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డును ఆనుకొని ఉన్న సర్వేనంబర్ 242లో 6 గుంటలు, 243లో 29 గుంటల భూమి కబ్జాకు గురైందని తెలుసుకున్న ఆర్ఐ జయప్రకాష్ నారాయణ పోలీస్ అధికారులతో కలిసి బాధ్యులైన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కబ్జాకు పాల్పడిన వ్యక్తిపై బొల్లారం పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని, చట్టపరమైన తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

నారాయణఖేడ్: ఖేడ్ బైపాస్ రోడ్డులోని కాలనీలకు విద్యుత్‌ను సరాఫరా చేయడానికి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అవసరమైన విద్యుత్ స్తంభాలను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఎల్‌టీ లైను తీగల బిగింపును చేపట్టారు. ఆయా స్తంభాలకు వీధిదీపాల ఏర్పాటుకు అవసరమైన క్లాంపులు, క్లిప్పింగ్స్ బిగించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఇళ్లలోని పూలకుండీలు, ట్యాంకుల్లో నిల్వ ఉన్న నీటిని అవగాహన కల్పించి తొలగింపజేశారు. పలుచోట్ల రోడ్లపై దుకాణాదారులు చెత్త వేయగా వారితోనే శానిటరీ అధికారి శ్రీనివాస్ ఎత్తివేయించారు. మరోమారు చెత్తవేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

స్థానాల ఖరారు.. కసరత్తు ముమ్మరం

- అత్యధిక స్థానాల టాప్ 5 జిల్లాలలో సంగారెడ్డి
- త్వరలో తేలనున్న రిజర్వేషన్లు
- ఎన్నికల నిర్వహణకు అధికారులకు శిక్షణ



సంగారెడ్డి జోన్‌: త్వరలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో గతంలో కంటే జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలలో మార్పులు వచ్చాయి. పటాన్ చెరు నియోజకవర్గంలోని చాలా గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలలో విలీనం కావడంతో ఎంపీటీసీ స్థానాలు తగ్గిపోయాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను అధికారికంగా ఖరారు చేసింది. ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలను సైతం గుర్తించి, ఓటరు జాబితాలను సిద్ధం చేశారు.

271ఎంపీటీసీలు, 25జెడ్పీటీసీలు

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన స్థానాల ప్రకారం జిల్లాలో ఒక జిల్లా పరిషత్ చైర్మన్, 271ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 25ఎంపీపీ, జెడ్పీటీసీలున్నాయి. 2019 సంవత్సరంలో నిర్వహించిన పరిషత్ ఎన్నికల్లో 25 జెడ్పీటీసీలు, 295ఎంపీటీసీ స్థానాలున్నాయి. గతంలో ఉన్న ఎంపీటీసీ స్థానాలలో నుంచి 24కు తగ్గగా కొత్తగా ఒక జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానం పెరిగింది.

జిల్లాలోని ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	స్త్రీలు	పురుషులు	ఇతరులు
అందోల్	84,948	82,015	6
నారాయణఖేడ్	95,075	95,964	6
నర్సాపూర్	21,919	20,797	2
పటాన్‌చెరు	29,261	20,797	2
సంగారెడ్డి	68,688	65,908	27
జహీరాబాద్	95,491	95,047	2

జిల్లాలోని పరిషత్ స్థానాల వివరాలు

జిల్లా పరిషత్తు చైర్మన్	1
జెడ్పీటీసీలు	25
ఎంపీపీలు	25
ఎంపీటీసీలు	271

టాప్ 5 స్థానాలలో సంగారెడ్డి జిల్లా

రాష్ట్రంలోని అత్యధికంగా ఉన్న ఎంపీటీసీ జెడ్పీటీసీ స్థానాలలో టాప్ 5లో సంగారెడ్డి జిల్లా నాలుగో స్థానంలో ఉంది. మొదటి 5 స్థానాలలో నల్లగొండ, నిజామాబాద్, ఖమ్మం, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాలో ఉన్నాయి.

రిజర్వేషన్ల కోసం ఎదురుచూపు

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వచ్చే రిజర్వేషన్లపై ఆశావాహులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం అవుతున్నారు.

త్వరలో అధికారులకు శిక్షణ

పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు త్వరలో అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇప్పటికే ఫిబ్రవరి నెలలో ఒకసారి ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. నోటిఫికేషన్ విడుదల అయ్యేలోపు మరోసారి సంబంధిత అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు సమాచారం.



వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం భెల్‌లోని జీవీబీపీ పాఠశాలలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రి. చిత్రంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు.

నేడు కొత్త రేషన్ కార్డుల పంపిణీ

నియోజకవర్గానికి 3,332 రేషన్ కార్డులు మంజూరు.. ఆర్డీఓ రాంరెడ్డి

జహీరాబాద్ టౌన్‌: దశాబ్ద కాలంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పేదలకు రేషన్ కార్డులు అందనున్నాయి. ఈ నెల 19న కొత్త కార్డులు అందజేస్తామని ఆర్డీఓ రాంరెడ్డి తెలిపారు. పేద ప్రజలు గత కొన్నేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. జహీరాబాద్ నియోజవర్గంలో జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్ మండలాలు ఉండగా పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. మూడు దశల్లో వెరిఫికేషన్ పూర్తి చేసి 3,332 కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. జహీరాబాద్ మండలంలో 1271, మొగుడంపల్లిలో 595, న్యాల్‌కల్ మండలంలో 609, కోహీర్‌లో 355, ఝరాసంగం మండలంలో 502 కొత్త రేషన్ కార్డులు మంజూరు అయ్యాయి. కొత్త కార్డులకు అదనంగా 64,662 క్వింటాళ్ల బియ్యం అవసరం ఉంటుంది.

2,950 మంది పేర్ల చేర్పు

జహీరాబాద్ నియోజకవర్గంలో 2,950 మంది కుటుంబ సభ్యుల పేర్లను పాత రేషన్ కార్డులో చేర్పించారు. అనేక కారణాల వల్ల ఎంతో మంది వారి పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చేందుకు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం రేషన్ కార్డులో మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వడంతో పెద్ద సంఖ్యలో దరఖాస్తు పెట్టుకున్నారు. జహీరాబాద్ మండలంలో 1,280,మొగుడంపల్లి మండలంలో 374, ఝరాసంగం మండలంలో 385,న్యాల్‌కల్‌లో 315, కోహీర్ మండలంలో 596 మందిపేర్లను చేర్పించామని అధికారులు తెలిపారు. పట్టణంలోని ఎస్‌వీ ఫంక్షన్ హాల్ శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేస్తామని చెప్పారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్

వట్‌పల్లి(అందోల్): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జోగిపేట జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ సూచించారు. మండల పరిధిలోని మర్వెల్లి ఉన్నత పాఠశాలలో న్యాయసేవ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. బాలకార్మిక చట్టం, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, పోక్సో వంటి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. జోగిపేట సీఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ బాలికల హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ లవకుమార్, జోగిపేట బార్ ప్రెసిడెంట్ చంద్రారెడ్డి, న్యాయవాదులు పి.సంగమేశ్వర్, హరినారాయణ వర్మ, శ్రీకాంత్, వెంకటేశం, నర్సింహులు, మల్లేశం, సాయికృష్ణ, అలీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి మహ్మద్ అసదుల్లా షరీఫ్

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

- నేడు మండల ప్రజాదర్బార్
- గ్రామాల్లో పర్యటించిన బృందం

ఝరాసంగం(జహీరాబాద్): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన వివిధ రకాల పనులను గ్రామాల వారీగా ప్రత్యేక బృందం సభ్యులు ఆరా తీశారు. గ్రామాలలో వలసలు నివారించి స్థానికంగా ఉపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీని పకడ్బందిగా అమలు చేస్తున్నాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు, వ్యయం, కూలీల చెల్లింపులతోపాటు వివిధ రకాల అంశాలను బృందం సభ్యులు పరిశీలిస్తారు. ఈ పథకంలో పారదర్శకతతోపాటు జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు తనిఖీ చేస్తుంటారు.

ఒక ఎస్ఆర్పీ.. 11మంది బీఆర్పీలు

సామాజిక తనిఖీలో భాగంగా మండలానికి ఒక ఎస్ఆర్పీతోపాటు 11 మంది బీఆర్పీలను నియమించారు. వీరు బృందంగా ఏర్పడి ఈ నెల 9 నుంచి 18 వరకు అన్ని గ్రామాల్లో పర్యటించారు. పనుల్లో జరిగిన అవకతవకలను గుర్తించటంతో పాటు పనుల నాణ్యతలను పరిశీలించారు. అనంతరం సంబంధిత గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో సభలు పూర్తి అయ్యినట్లు అధికారులు తెలిపారు.



కక్కర్‌వాడలో కొలతలు వేస్తున్న బృందం సభ్యులు

ఉపాధిలో రూ.10కోట్లకు పైగా ఖర్చు

2024-2025 ఆర్థిక సంవత్సరంలో మండలానికి సుమారు రూ.10కోట్లకు పైగా ఖర్చు చేశారు. 67,545 కూలీలు పని చేసిన 3,55,821 పనిదినాలకు గాను రూ.7.94కోట్ల కూలీలకు వేతనాలు చెల్లించారు. అదే విధంగా పంచాయతీరాజ్‌లో ఉపాధి నుంచి సీసీ రహదారులు, గ్రామ పంచాయతీ భవనాలు, కిచెన్ షెడ్లు, కంపౌండ్ వాల్‌ల నిర్మాణాలకు గాను రూ.2.20కోట్లు వెచ్చించారు.

నేడు ప్రజాదర్బార్

మండల కేంద్రమైన ఝరాసంగం మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో నేడు ఉదయం 10గంటలకు ఉపాధి హామీ ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు మండల అధికారులు తెలిపారు. గ్రామాల వారిగా బృందం సభ్యులు నిర్వహించిన తనిఖీల వివరాలను బహిరంగంగా చదివి వినిపిస్తారు.

ఏబీవీపీ దాడిలో రావూస్ స్కూల్ ధ్వంసం

ఉపాధ్యాయులకు స్వల్ప గాయాలు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మల్కాపూర్‌లో గల రావూస్ స్కూల్‌పై ఏబీవీపీ నాయకులు దాడి చేశారు. ఈ దాడిలో పలు కంప్యూటర్‌లతో పాటు పాఠశాల బస్సు, ఆఫీస్ రూం అద్దాలు ధ్వంసమయ్యాయి. అదేవిధంగా వైస్ ప్రిన్సిపాల్‌తో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ నెల 17న సభ్యత్వం కావాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు పాఠశాలకు వెళ్లగా...ఇక్కడ ఉండేది మైనర్ పిల్లలేనని, సభ్యత్వాలు వద్దని పాఠశాల యాజామాన్యం సున్నితంగా తిరస్కరించడంతో వెళ్లిపోయారు. ఈ విషయంపై తిరిగి ఏబీవీపీ నాయకులు సుమారుగా 20 మంది శుక్రవారం అక్రమంగా పాఠశాలలోకి చొరబడి ఫర్నీచర్ ధ్వంసం చేయడంతోపాటు మహిళా ఉపాధ్యాయులపై దాడికి యత్నించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దాడి చేసిన ఏబీవీపీ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రేపే ముదిరాజ్ దశాబ్ది ఉత్సవాల బోనాల జాతర

హాజరు కానున్న ప్రముఖులు

సంగారెడ్డి: ఆషాఢ మాస బోనాల జాతరను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా సంఘం పట్టణ అధ్యక్షుడు తెలుగు జనార్దన్ మాట్లాడుతూ...ముదిరాజ్ ముద్దుబిడ్డ పులిమామిడి రాజు ప్రోత్సాహంతో, ముదిరాజ్ సోదరులకు సహకారంతో ప్రతి ఏటా బోనాల జాతర ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈసారి కనీవినీ ఎరుగని రీతిలో బోనాల దశాబ్ది ఉత్సవం జరిపిస్తామన్నారు. కార్యక్రమం పాత బస్టాండ్ వద్ద సంగమేశ్వరాలయంలో బోనాల అలంకరణ ఏర్పాటు చేసి అక్కడి నుండి అమ్మవారికి బోనాలు ఊరేగింపు, పోతరాజుల విన్యాసం, ఫలహారం బండి వివిధ సంస్కృతి కార్యక్రమాలతో బోనాల జాతర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు తిరుమలరావు, ప్రచార కార్యదర్శి ఆర్కే రామకృష్ణ, నాయకులు రాములు, అంజయ్య, మల్లయ్య, కేశవులు, కొత్లపూర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో మహిళలకు 50 శాతం సీట్లు

జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్

జహీరాబాద్ టౌన్‌: స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుందని ఎంపీ.సురేష్ షెట్కార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో మహిళా శక్తి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాల్లో రాణించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిర్మల మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా వడ్డీలేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ రావు, మెప్మా, సెర్ప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్, చైర్‌పర్సన్ నిర్మల తదితరులు

వార్డుల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరు ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య, చిత్రంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్‌: జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు ఉదయం సమయాల్లో వార్డుల్లో పర్యటించి, సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ఉన్న ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలతోపాటు డ్రైనేజీలను గుర్తించి, నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలలో, హెచ్‌ఎండీఏలలో ఉన్న అన్ని పార్కు స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సంరక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కొల్లూర్ డబుల్ బెడ్ రూంలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సూచిక గణాంకాలు జాగ్రత్తగా పొందుపరచాలి

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామపంచాయతీ అభివృద్ధిలో భాగంగా పంచాయతీ రాజ్ శాఖ నిర్దేశించిన తొమ్మిది అంశాలలో సూచికలకు సంబంధించిన గణాంకాలను జాగ్రత్తగా పొందుపరచాలన్నారు. మండల కేంద్రమైన కొండాపూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో పాటు వివిధ శాఖల అధికారులకు అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సత్తయ్య యాదవ్ మాట్లాడుతూ...గ్రామపంచాయతీ అభివృద్ధికి సంబంధించిన వివిధ శాఖల పరంగా చేపడుతున్నటువంటి కార్యక్రమాల వివరాల ఆధారంగా జాతీయ గ్రామపంచాయతీ అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో ప్రతీ గ్రామపంచాయతీ అభివృద్ధి సూచికల వివరాలు పొందుపరచాలని స్పష్టం చేశారు. ప్రతీ శాఖ పరంగా ఒక గ్రామ పంచాయతీ సాధించిన లక్ష్యాలను వాటికి సంబంధించిన వివరాలను పొందుపరిస్తే ఆ వివరాలతో వచ్చేటువంటి మార్కుల ఆధారంగా అవార్డుల ఎంపిక ఉంటుందన్నారు. ప్రతి శాఖకు సంబంధించిన కార్యక్రమాల వివరాలు సంబంధిత విభాగం నుంచి తీసుకోవాల్సిందిగా కార్యదర్శులకు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీఓ వీరప్ప, ఏపీఎం సరిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల, విమల, మెడికల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్తయ్య



పొంగిపొర్లుతున్న పార్యవరం వాగు



పత్తి పంటలో నిలిచిన వర్షం నీరు

కురిసిన భారీ వర్షం

- పంట పొలాల్లో నిలిచిన నీరు
- పొంగిపొర్లిన ప్యారవరం వాగు

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో భారీ వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు వివిధ గ్రామాల్లో సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి పంటపొలాల్లో నీరు నిలిచింది. రోడ్డు పక్కన ఉన్న గుంతలన్నీ నీటితో నిండిపోయాయి. పాఠశాల విద్యార్థులతో పాటు ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్యారవరం గ్రామ శివారులోని వాగు పొంగిపొర్లింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆటోడ్రైవర్లకు పార్కింగ్ స్థలం కేటాయించండి

పటాన్‌చెరు: లింగంపల్లిలో నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్ కింద ఆటో డ్రైవర్లకు సరిపడా స్థలం కేటాయించాలని జాతీయ రహదారుల సంస్థ ప్రాంతీయ అధికారి కృష్ణ ప్రసాద్‌ను గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి చర్చించారు. శేరిలింగంపల్లి నుంచి ఇస్నాపూర్ వరకు ఆటోలు నడిపిస్తూ జీవనోపాధి పొందుతున్న వేలాది మంది డ్రైవర్లకు లింగంపల్లి చౌరస్తాలో ఆటోస్టాండ్ లేకపోవడంతో గిరాకీ లేక ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు. త్వరలోనే ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.



కృష్ణ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

సంక్షిప్త వార్తలు

◆ చెక్కు అందజేత

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని రాసోల్ గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్‌కు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిలు, పార్టీ మండల అధ్యక్షుడు పరమేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పరశురాం, కురుమ సంఘం తాలుకా ఉపాధ్యక్షులు మల్గొండ, నాయకులు శ్రీధర్ పటేల్ పాల్గొన్నారు.

◆ బాధ్యతలు మోస్తూ చదువులో ప్రతిభ

నారాయణఖేడ్: పట్టణానికి చెందిన పురోహితులు మలమంచి గురురాజశర్మ సతీమణి మలమంచి శిల్ప కుటుంబ బాధ్యతలు మోస్తూనే చదువును కొనసాగిస్తూ తెలంగాణ విశ్వవిద్యాలయంలో బీఎడ్‌లో ప్రతిభ చూపి బంగారు పతకాన్ని సాధించడం అభినందనీయమని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ సంగారెడ్డి రీజియన్-18 కార్యదర్శి నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఖేడ్‌లో సంస్థ తరపున గురురాజశర్మ, శిల్ప దంపతులను సన్మానించారు. సంస్థ కోశాధికారిణి లావణ్య, ట్రెనింగ్ డైరెక్టర్ బాలమణి, సర్వీసెస్ డైరెక్టర్ రమేష్, ఇతర బాధ్యులు నర్సింహులు, కరుణ దేశముఖ్, భూమయ్య, మధుసూదన్‌రెడ్డి, సంతోష్ కుమార్, శ్వేత పాల్గొన్నారు.

◆ రాళ్లకత్వలో డీఎస్పీ పర్యటన

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని రాళ్లకత్వలో శుక్రవారం పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్ పర్యటించారు. గ్రామ సమీపంలోని కంకర క్వారీల ప్రాంతాన్ని స్థానిక ఎస్ఐ నాగలక్ష్మి సిబ్బందితో కలిసి పరిశీలించారు. కేవలం భద్రత చర్యల్లో భాగంగా పరిశీలించినట్లు ఎస్ఐ తెలిపారు.

◆ దాతల సహకారం అభినందనీయం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతల సహకారం అభినందనీయమని మండల విద్యాధికారి శంకర్ పేర్కొన్నారు. మండలంలోని ఆత్మకూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సదాశివపేట శాఖ సహకారంతో నిర్మాణ్ సంస్థ వారు వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు మంచినీటి కోసం ఆర్వో ప్లాంట్,కంప్యూటర్లు, ప్రింటర్ కమ్ జిరాక్స్, మైక్ సెట్, 25 డ్యూయల్ డెస్కులు, ఆఫీస్ ఫర్నీచర్, స్పోర్ట్స్ మెటీరియల్‌ను శుక్రవారం అందించారు.

◆ నేడు ఆత్మ చైర్మన్‌గా రామలింగారెడ్డి ప్రమాణ స్వీకారం

జహీరాబాద్: ఆత్మ కమిటీ చైర్మన్‌గా నియమితులైన పి.రామలింగారెడ్డి శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఉదయం 11.30 గంటలకు పట్టణంలోని పీవీఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి మంత్రి దామోదర్ రాజనర్సింహా, జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి హాజరవుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి పేర్కొన్నారు.

◆ సమీక్ష సమావేశం బహిష్కరణ

రాయికోడ్(అందోల్): మూడు నెలలుగా తమకు వేతనాలు అందకపోవడంతో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు నిరసనగా సమీక్ష సమావేశాన్ని బహిష్కరించారు. ఎంపీపీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించే సమావేశాన్ని బహిష్కరిస్తూ ఎంపీడీఓ ఎంఎం షరీఫ్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఏలు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలను వెంటనే అందించాలని కోరారు.

◆ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పటాన్‌చెరుటౌన్‌: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పటాన్‌చెరు ఎస్ఐ శ్రీశైలం అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కళాశాలలో చదివే విద్యార్థులు మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, భవిష్యత్తులో కెరీర్‌పై ఒక నిర్ణయాత్మకమైన ఆలోచన ఉంచుకొని ఆ దిశగా కష్టపడాలన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకటేశం మాట్లాడుతూ.. యువత వారి భవిష్యత్తుపై దృష్టి ఉంచాలని సూచించారు.

వైకుంఠపురంలో ప్రత్యేక పూజలు

సంగారెడ్డి టౌన్‌: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణ శివారులోని శ్రీవైకుంఠపురం ఆలయంలో శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్యశాఖ మంత్రి సతీమణి దామోదర పద్మిని హాజరయ్యారు. అనంతరం మహిళలు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.